క్లుప్తంగా

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారి ఆలయానికి ప్రభలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో మంగళ వారం ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రభలతో మేళ తాళాలు, ఉప్పు వాయిద్యాలతో ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు



పిల్లలకు అందించిన భోజనాలను పరిశీలిస్తున్న పీడీ శాంతకుమారి

గంట్యాడ: బుడతానపల్లి గ్రామంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ పీడీ బి.శాంత కుమారి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, స్టాక్, భోజనాలను పరిశీలించారు. సమయానికి కేంద్రాలు తెరవాలని, పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. సమాచారం ఇవ్వకుండా విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'ఉపాధి' నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం



గరుగుబిల్లిలో భూమిపూజ చేస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు, నాయకులు

మెరకముడిదాం: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు, కాలువలు నిర్మిస్తు న్నామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు తెలిపారు. మండలంలోని గరుగుబిల్లి, భీమవరం, రాచగుమడాం, రామాయవలస తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. టీడీపీ నాయకు లు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల మోతీలాల్‌నాయుడు, తాడ్డి చంద్ర, కెంగువ ధనుంజయ, మండల రమణ, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఎస్.కోట ప్రధాన రహదారిలో ఆక్రమణల తొలగింపు పనులు చేయిస్తున్న తహసీల్దార్ అరుణకుమారి

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రధాన రహదారిలో ఆక్రమణలపై అధికారులు దృష్టి సారించారు. ప్రధాన రహదారి మొత్తం ఆక్రమణలతో కుంచించుకుపోయింది. దీంతో గతంలో తుపాను సమయంలో భారీగా వరద నీరు ప్రధాన రహదారిపై నిలిచిపోయి వాహన చోదకులు, పట్టణ వాసులు నానా యాతన పడ్డారు. తాజాగా వాతావరణశాఖ మూడు రోజుల పా టు తుపాను ప్రభావం ఉంటుందంటూ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో తహసీల్దార్ అరుణకుమారి ముందస్తు పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు.పంచాయతీ ఈఓ అనూరాధ, ఈఓపీఆర్డీ లక్ష్మి, వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బందితో కలిసి ప్రధాన రహదారిలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో ఆక్రమణలను తొ లగింపు పనులు చేయించారు. వర్షపు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నారు.

ఫీవర్ సర్వే

వేపాడ: మండలంలోని గడబవలస గ్రామంలో బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి రమాదేవి ఆదేశాలతో వైద్యసిబ్బంది మంగళవారం ఫీవర్ సర్వే నిర్వహించారు.జ్వరలక్షణాలు ఉన్న ముగ్గురిని గుర్తించి మాత్రలు పంపిణీ చేశారు. గ్రామస్తులకు ఆరోగ్య జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

వేపాడ: ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ సూర్యనారాయణ సూచించారు. ఓబలయ్యపాలెం గ్రామంలో మంగళవారం చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. సచివాలయ సిబ్బంది, గ్రామపెద్దలు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇళ్లలో తడి, పొడిచెత్తను వేరు వేరుగా డస్ట్‌బిన్‌లలో వేసి ఉదయాన్నే ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్‌కు అందజేయాలని ప్రజలను కోరారు.

పంచాయతీ సొమ్ము పరుల పాలు

- ఎస్.కోట మేజర్‌పంచాయతీకి ఆస్తులు ఉన్నా..ఆదాయం సున్నా
- తిలాపాపం తలా పిడికెడు
- పంచాయతీ దుకాణాలకు ఏళ్లతరబడి బినామీలే యజమానులు
- ప్రైవేటు దుకాణాలకు రూ.వేలల్లో అద్దెలు ఉంటే.. పంచాయతీ దుకాణాలకు నామమాత్రపు అద్దె



ఎస్.కోట పట్టణంలో పంచాయతీ దుకాణాల సముదాయాలు



శృంగవరపుకోట: ''తిలా పాపం తలా పిడికెడు'' అన్న సామెత తీరుగా అనాది నుంచి పంచాయతీ ఆదాయాన్ని గాదె కింద పంది కొక్కుల్లా బినామీలు తింటూనే ఉన్నారు. వాళ్లకి ఏలికలు, పాలకులు ఏతావాతా సాయం అందిస్తూనే ఉన్నారు. దీంతో అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉందన్న సామెత చందంగా ఆస్తులు ఉన్న ఎస్.కోట మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేని దుర్భర స్థితి నెలకొంది.ఎస్.కోట మేజర్ పంచాయతీకి ఆస్తులు ఉన్నా, వాటిపై సరైన అజమాయిషీ లేక పోవడం, పాలకవర్గాలు వాటిని పప్పు బెల్లా ల్లా తమ వారి ప్రయోజనాల కోసం పణంగా పెట్టడంతో ఆదాయం లేకుండాపోతోంది. పట్టణంలో ని ప్రధాన రహదారిలో పాత షాపింగ్ కాంప్లెక్స్‌లో 12 దుకాణాలు, కొత్త షాపింగ్ కాంప్లెక్స్ బ్లాక్-1లో 10 దుకాణాలు, బ్లాక్-2లో 5 దుకాణాలు, బ్లాక్-3లో 4 దుకాణాలు, మరో నాలుగు స్టాల్స్ పంచాయతీకి ఉన్నాయి. వీటి వల్ల ఏటా రూ.1,45,510 ఆదాయం అద్దెల రూపంలో రావాల్సి ఉంది. అయితే ఈ మొత్తాలు కూడా వసూళ్ల కాక ఉద్యోగులు తల పట్టుకుంటున్నారు.

బినామీలదే రాజ్యం

'రాజ్యం వీరభోజ్యం' అని పెద్దలు చెప్పినట్లు ఇక్కడ అధికారం, పలుకుబడి, దౌర్జన్యం ఉన్నోళ్లదే పెత్తనం.ఇదే తీరుగా ఏళ్ల క్రితం కొందరు పంచాయతీ దుకాణాలను అతి తక్కువ అద్దెలకు దక్కించుకుని, తర్వాత వాటిని బయటి వారికి వేలల్లో అద్దెలకిచ్చి పంచాయతీకి పంగనా మం పెడుతూ దోచుకుంటున్నారు. కాలం చెల్లిన భవనాలను తొలగించాలని ఇంజినీరింగ్ శాఖ చెప్పినా, పాలకవర్గాల ఒత్తిళ్లతో అధికారులు చోద్యం చూస్తున్నారు.

యథేచ్ఛగా దోపిడీ

పంచాయతీ దుకాణాలున్న ప్రాంతాల్లోనే ఉన్న ప్రైవేటు దుకాణాలకు రూ.15వేల నుంచి రూ. 20 వేల వరకు అద్దెలు చెల్లిస్తున్నారు. పంచాయ తీ దుకాణాలకు మాత్రం రూ.2 వేల నుంచి రూ.5వేల వరకూ అద్దెలు చెల్లిస్తున్నారు. ప్రతీసారి కొత్త పాలకవర్గం రాగానే అద్దెలు పెంచుతా మని, కాలం చెల్లిన పాత దుకాణాలు తీసేసి కొత్తవి కట్టేస్తాం అంటూ హడావిడి చేస్తారు. దీంతో బినామీలు సిట్టింగ్ పెట్టి, కొంత మొత్తం ముట్ట చెప్పగానే ప్రతిపాదనలు బుట్టదాఖలు అయిపోతాయి. ఇలా గత పదిహేనేళ్లుగా ఇదే సినిమా నడుస్తోంది. పాలకవర్గాలో నిజాయితీ, అధికారుల్లో చిత్తశుద్ధి కరువై పంచాయతీ కునారిల్లిపోతోంది. ఆరేళ్ల క్రితం కాలం చెల్లిన పాత దుకాణాలు తీసేసి కొత్తవి కట్టేయాలి, పంచాయతీ ఆదాయం పెంచేయాలి అంటూ ఎమ్మెల్యే లలితకుమారి నాటి పాలకవర్గం హడావిడి చేశారు. మళ్లీ ఎమ్మెల్యే అయిన లలితకుమారి, ప్రస్తుత పంచాయతీ పాలకవర్గం ఇటీవల నిర్వహించిన సర్వసభ్య సమావేశంలోనూ మళ్లీ పాత పాటే పాడారు.

మెరుగైన వైద్యం అందించండి



ఐసీయూలో చికిత్స పొందుతున్న రమణను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలై విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతున్న ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణను, ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మంగళ వారం పరామర్శించారు. రమణ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆయన మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైన శస్త్ర చికిత్సలు చేయించాలని, ఎలాంటి అవసరమైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ రమణ వైద్యం కోసం పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని, కోలుకుంటారని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని భరోసా కల్పించారు. అయితే రమణకు రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సహాయం అందించాలని సూచించారు. జెడ్పీ చైర్మన్ వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఉన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



జామి హైస్కూల్‌లో ప్రచారం చేస్తున్న పీఆర్టీయూ నేతలు

శృంగవరపుకోట: త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పీఆర్టీయూ ప్రచారం ప్రారంభించింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ రాజు ఎస్.కోట ఎల్.కోట, జామి మండలాల్లోని ఉన్నత పాఠశాలలు, కేజీబీవీల్లో ఉపాధ్యాయులను మంగళవారం కలిసి ప్రచారం చేశారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ సాధనకు ఎంతగానో కృషి చేసిన శ్రీనివాసులునాయుడును శాసన మండలి సభ్యునిగా ఎన్నుకోవడం ద్వారా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమవుతాయని అశోక్‌రాజు, కర్రి మోహన్ రాజ్ తెలిపారు. ఓటరు నమోదు కోసం నవంబర్ 6వ తేదీలోగా ఉపాధ్యాయులు అంతా దరఖాస్తులు నింపి, డ్రాయింగ్ అధికారి సంతకం చేయించి, ఆధార్, ఓటరు కార్డులు, ఫొటోలు జత చేసి తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి కె.బంగారు నాయుడు, మండల ప్రధాన కార్యదర్శులు జి.సూరిబాబు, టి.అప్పారావు, డి.వి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం మాత్రమే ఇస్తాం...

- గ్రీన్‌ఫీల్డ్ హైవే ఇంటర్ చేంజ్ నిర్మాణానికి సహకరించాలి
- ఇళ్లు, భూములు కోల్పోతున్న వారితో సమావేశం
- ఇళ్లు కోల్పోయే వారికి ఇంటి స్థలం ఇవ్వలేం – ఆర్డీఓ కీర్తి



మాట్లాడుతున్న ఆర్డీఓ కీర్తి

కొత్తవలస: జాతీయ హరిత రహదారి(గ్రీన్‌ఫీల్డ్ హైవే 130సి,డి)నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న వారికి పరిహారం మాత్రమే అందిస్తామని, స్థలానికి బదు లు మరోచోట స్థలం ఇచ్చే ప్రసక్తి లేదని విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి తేల్చిచెప్పారు. గ్రీన్ ఫీల్డ్‌హైవే పనుల్లో భాగంగా ఉత్తరాపల్లి రెవెన్యూ పరిధిలో ఇంట ర్ చేంజ్ నిర్మాణానికి సంబంధించి భూములు, ఇళ్లు కోల్పోతున్న వారితో తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భం గా పలువురు రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో ఈ ప్రాంతంలో భూమి విలువ ఎకరానికి రూ.6 నుంచి రూ.7 కోట్లు పలుకుతోందని, కానీ నేషనల్ హైవే అధికారులు ఎకరానికి రూ.37 లక్షలు మాత్రమే అందజేస్తామనడం దారుణమని వాపోయారు. పరిహారం పెంచాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కోల్పోతున్న వారు పరిహారంతో పాటు మరోచోట ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కీర్తి మాట్లాడుతూ ఇంటర్ చేంజ్ నిర్మాణానికి సుమారు 144 ఎకరాలు అవసరమని గుర్తించామన్నారు. ఇప్పటికే సగానికి పైగా భూయజమానులకు పరిహారం అందించి భూములను స్వాధీనం చేసుకున్నామని తెలి పారు. ప్రస్తుతం 45 ఎకరాలకు సంబంధించి రైతులకు పరిహారం చెల్లించి స్వాధీనం చేసుకోవాల్సి ఉందని, ఈ ప్రక్రియ వారం రోజుల్లోగా పూర్తి చేస్తామన్నారు. అలాగే గాంధీనగర్ గ్రామంలో 24 మంది దళితులు ఇళ్లు కోల్పోతున్నారని, వారి ఇళ్ల విలువ అంచనావేసి పరిహారం అందజేస్తామని, మరో చోట ఇంటి స్థలం ఇవ్వలే మని చెప్పారు. అధికారులు బాధితులకు వాస్తవాలు వివరించి ఒప్పించాలని, కళ్లబొల్లి కబుర్లు చెప్పి మభ్యపెట్టవద్దని సూచించారు. అలాగే డివిజన్‌లో పరిధిలో రీసర్వే జరిగిన గ్రామాల్లో భూసమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న గ్రామసభలు విజయవంతంగా సాగుతున్నాయని చెప్పారు. రైతుల నుంచి అందిన వినతులను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ నీలకంఠరావు, డీటీ పప్పు హరి, పలువురు వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్ ఎస్పీ వకుల్ జిందాల్

గజపతినగరం: గ్రామాల్లో నేరాల నియంత్రణపై పోలీస్ సిబ్బందితో పాటు సచివాలయ మహిళా పోలీసులు ప్రత్యేక దృష్టిసారించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పాటు పడాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ముందుగా మహిళా పోలీసులు, వివిధ గ్రామాలను దత్తత తీసుకున్న పోలీసులతో సమావేశమ య్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహించినా, గంజాయి రవాణా చేసినా వినియోగించినా వెంటనే సమాచారాన్ని సంబంధిత పోలీస్ అధికారి దృష్టికి తీసుకురావాలని మహిళా పోలీసులకు సూచించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, ట్రాఫిక్ నిబంధనలు, మహిళా రక్షణ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే గ్రూపు తగాదాలు,భూతగాదాలు, కొట్లాటలు, పార్టీతగాదాలు, నేరస్తుల ప్రస్తుత స్థితిగతులను తెలుసుకోవాలని చెప్పారు. పోలీస్ సిబ్బంది తమకు కేటాయించిన దత్తత గ్రామాన్ని వారంలో ఒకరోజు సందర్శించి గ్రామంలో పరిస్థితులను అధికారులకు నివేదించాలని ఆదేశించారు. అనంతరం 60 మంది వృద్ధులకు స్థానిక పోలీస్ సిబ్బంది సమకూర్చిన దుప్పట్లు, పండ్లను ఎస్పీ పంపిణీ చేశారు. బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, గజపతినగరం సీఐ జి.ఏ.వి.రమణ, ఎక్సైజ్ సీఐ ఏ.వి.లీలారావు, ఎస్‌ఐలు కె.లక్ష్మణరావు, యు.మహేష్, రాజేష్, ఆర్.జయంతి పాల్గొన్నారు.

డయేరియా ప్రభావిత కెంగువలో పర్యటన



కెంగువ వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మోహన్‌రావు, అధికారులు



కన్నాంలో ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



తాగునీటి శాంపిల్స్ సేకరిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

గజపతినగరం: మండలంలోని డయేరియా ప్రభావిత కెంగువ గ్రామంలో బొబ్బిలి ఆర్డీఓ జె.వి.ఎస్.ఎస్.రామ్మోహన్‌రావు, మండల అధికా రులు మంగళవారం పర్యటించారు. ఆస్పత్రుల నుంచి ఇళ్లకు చేరిన బాధితులను పరామర్శించారు. స్థానిక హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి, అక్కడ చికిత్స పొందుతున్న పెనుమజ్జి గాయత్రి, పెనుమజ్జి సూర్యకళ ఆరోగ్య పరిస్థితిపై వైద్య సిబ్బందిని ఆర్డీఓ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో వీధి కాలువలు, పరిసరాలను పరిశీలించారు. గ్రామంలో ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేశారు. అలాగే కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి శాంపిల్స్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ రత్నకుమార్, ఎంపీడీఓ బి.కల్యాణి, ఆర్‌ఐ కె.అప్పలరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గార తవుడు, తుమికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, మరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు మండలంలో డయేరియా

దత్తిరాజేరు: మండలంలో డయేరియా కేసులు బయటపడుతున్నాయి. మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులు డయేరియా లక్షణాల తో గజపతినగరం సీహెచ్‌సీలో రెండురోజుల క్రితం చేరారు. ప్రస్తుతం వీరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దత్తిరాజేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆనంద్‌కుమార్ వద్ద సాక్షి మంగళవారం ఈ విషయం ప్రస్తావించగా కన్నాం గ్రామానికి చెందిన తలే కన్నమ్మ, గుచ్చిమి గ్రామానికి చెందిన టి.నారాయణమ్మ, దాసుపేటకు చెందిన రేవల్ల నారాయ ణప్పడుకు వాంతులు, విరేచనాలు కావడంతో గజపతినగరం సీహెచ్‌సీలో చేరారన్నారు. కన్నమ్మ, నారాయణమ్మ బంధువుల ఇళ్లలో విందు భోజనం చేయడం వల్ల, నారా యణప్పడు రోడ్డుపై తినుబండారాలు తినడం వల్ల వాంతులు, విరేచనాలు అయినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. వారి ఆరోగ్యపరిస్థితి ప్రస్తుతం బాగానే ఉందని చెప్పా రు. అలాగే పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలతో వైద్యాధికారి సమావేశమయ్యారు. సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో ప్రజలకు వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. కన్నాం గ్రామంలో వైద్యసిబ్బంది ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మాత్రలు పంపిణీ చేశారు.

దాన తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి



వేపాడ: మండల అధికారులకు సూచనలు చేస్తున్న నోడల్ అధికారి లక్ష్మీనారాయణ



దత్తిరాజేరు: సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి శాంతకుమారి

దాన తుఫాన్ నేపథ్యంలో ఈ నెల 24, 25వ తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కొత్తవలస,లక్కవరపుకోట,జామి రెవెన్యూ కార్యాలయాల్లో ,దత్తిరాజేరు, బొండపల్లి, వేపాడ ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆయా మండలాల తహసీల్దార్‌లు, ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచి వాలయ సిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. విద్యుత్, ఆరోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించి తుఫాన్ తీవ్రతను ప్రజలు, రైతులకు వివరించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని చెప్పారు. తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ఏమైనా నష్టాలు జరిగితే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాల్సిన బాధ్యత పంచాయతీ,రెవెన్యూ కార్యదర్శులదేనని చెప్పారు.గ్రామాల్లో శానిటేషన్ పనులు చేయించడంతో పాటు,తాగునీటి వనరులన్నింటిలో క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. గండిపడే అవకాశం ఉన్న చెరువులను గుర్తించి గండ్లు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వివరించారు. తహసీల్దార్ కార్యాలయాలతో పాటు సచివాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అవసరమైన 104,108 వాహనాలు సిద్ధంగా ఉంచాలని వైద్యశాఖకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, వైద్యారోగ్య, వ్యవసాయ శాఖ అధికారులు, ఈఓపీఆర్డీలు పాల్గొన్నారు.

– కొత్తవలస/లక్కవరపుకోట/జామి/దత్తిరాజేరు/ బొండపల్లి/ వేపాడ

రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత



గుర్ల: త్రోబాల్, కబడ్డీ పోటీలకు ఎంపికైన వల్లాపురం హైస్కూల్ విద్యార్థులతో హెచ్‌ఎం అప్పారావు, పీఈటీ తిరుపతిరావు



గుర్ల: కబడ్డీ పోటీలకు ఎంపికైన కొండగండ్రేడు హైస్కూల్ విద్యార్థులతో హెచ్‌ఎం వెంకటరావు, పీఈటీ సంధ్యారాణి



కొత్తవలస: కబడ్డీ, బాక్సింగ్, హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన భారత్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు



గంట్యాడ: కబడ్డీ పోటీలకు ఎంపికైన పెదవేమలి హైస్కూల్ విద్యార్థినులతో ఉపాధ్యాయులు



కొత్తవలస: వివిధ క్రీడా పోటీలకు ఎంపికైన జిందాల్ విద్యార్థులతో ఆ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు

గుర్ల: మండలంలోని వల్లాపురం, కొండగండ్రేడు హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ, త్రోబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని ఆయా పాఠశాల పీఈటీలు ఎం.తిరుపతిరావు, బి.సుధారాణి మంగళవారం తెలిపారు. అండర్-14 కబడ్డీ బాలురు, బాలికల విభాగంలో కొండగండ్రేడు హైస్కూల్ విద్యార్థులు బి.భానుప్రకాష్, పి.నాగమణి, అండర్-17 బాలురు, బాలికల విభాగంలో బి.చరణ్‌తేజ, ఎం.వాణి, సీహెచ్.గౌరి ఎంపికయ్యారు. వల్లాపురం హైస్కూల్ నుంచి అండర్-14 త్రోబాల్ పోటీలకు నలుగురు, అండర్-17 కబడ్డీ పోటీలకు నలుగురు ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్‌ఎంలు అప్పారావు, ఎం.వెంకటరావు ఉపాధ్యాయులు అభినందించారు.

పెదవేమలి నుంచి ముగ్గురు...

గంట్యాడ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలకు పెదవేమలి ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఆదిలక్ష్మి మంగళ వారం తెలిపారు.అండర్-17 విభాగంలో విద్యార్థిని ఎస్.లక్ష్మీదేవి, అండర్ -14 విభాగంలో పి.వెంకీ, ఎర్ని భవానీ జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్లలో చోటు సాధించారని చెప్పారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

జిందాల్ స్కూల్ నుంచి 9 మంది..

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని ఓపీ జిందాల్ భారత్ పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీ లకు అర్హత సాధించారని ప్రిన్సి పాల్ విశ్వనాథం మంగళవారం తెలిపారు. ఫుట్‌బాల్ పోటీలకు అండర్-14 విభాగంలో సింగంపల్లి శేఖర్, వ్యాండ్‌బాల్ పోటీల కు డి.భవ్యశ్రీ, అండర్-17 విభాగం బాస్కెట్‌బాల్ పోటీలకు పి.వి.పి.కార్తికేయ, అండర్-14 విభాగంలో ఏ.పవన్‌తేజ, కె.పవన్‌కుమార్, బాలికల విభాగంలో ఎల్.కుసుమ, సింగంపల్లి నితీష్ ఎంపికయ్యారు. అండర్-14 బాలుర, బాలికల విభాగం త్రో బాల్ పోటీలకు పి.భానుశంకర్, కె.గీతామాధురి ఎంపికయ్యారు. వీరు త్వరలో అనంతపురం,గుంటూరు జిల్లాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్ల తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.

భారత్ డిఫెన్స్ అకాడమీ నుంచి అయిదుగురు..

కొత్తవలసలోని భారత్ డిఫెన్స్ అకాడమీకి చెందిన అయిదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్- 19 కబడ్డీ, బాక్సింగ్,హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ కడారి రాజు మంగళవారం తెలిపారు. కబడ్డీ పోటీలకు విద్యార్థులు జి.భానుప్రసాద్, జి.హరీష్, బాక్సింగ్ పోటీలకు కర్రి శ్యామ్‌కుమార్, జి.రాహుల్, హ్యాండ్‌బాల్ పోటీలకు పి.సిద్ధార్థ అర్హత సాధించారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించండి



బొండపల్లి: మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ చంద్రశేఖర్ బాబు



జామి: విజినిగిరిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ కిరణ్‌కుమార్

బొండపల్లి: పంటల సాగులో రైతులు రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ చంద్రశేఖర్‌బాబు అన్నారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా వెదురువాడ, ఎం.కొత్తవలస గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో రైతులకు మంగళ వారం అవగాహన కల్పించారు. సాగులో పాటించాల్సిన మెలకువలు, యాజమాన్యపద్ధతులు, తెగుళ్ల నివారణకు పాటించాల్సిన చర్యలను వివరించారు. ఏఓ పి.వి.మల్లికార్జునరావు,ఎం.కొత్తవలస సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సలహాలు పాటించాలి

దత్తిరాజేరు: రైతులు పంటల సాగుకు సంబంధించి వ్యవసాయ అధికారులు, సిబ్బంది ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలని ఏఓ అనురాధ సూచించారు.'పొలం పిలుస్తోంది' కార్యక్ర మంలో భాగంగా పి.లింగాలవలసలో మంగళవారం వరి పంటను పరిశీలించారు. అనంతరం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వరి పంటలో తెగుళ్ల నివారణకు పిచికారీ చేయాల్సిన పురుగు మందులను సిఫార్సు చేశారు.

సకాలంలో తెగుళ్లను గుర్తించాలి

చీపురుపల్లి: పంటలను ఆశించే తెగుళ్లను రైతులు సకాలంలో గుర్తించి, నివారణ చర్యలు పాటించాలని ఏఓ సీహెచ్.రఘునాథ్ సూచించారు. గొల్లలములగాం గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి, తెగుళ్ల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు.

మాస్క్ ధరించాలి

గంట్యాడ: రైతులు పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు తప్పనిసరిగా మాస్క్ ధరించాలని ఏఓ బూసే శ్యామ్‌కుమార్ సూచించారు. పెదవేమలి గ్రామంలో మంగళవారం' పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పురుగు మందులు కలిపేటప్పుడు, పిచికారీ చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ భూముల్లో ఫారం పాండ్‌లు తవ్వించు కోవాలని రైతులకు సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో ఫారంపాండ్‌లో నిల్వనీరు పంటలను కాపాడుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఎంపీటీసీ పొటువు రెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునా యుడు పాల్గొన్నారు.

కాలిబాటలతో దోమపోటు నియంత్రణ

జామి: ప్రస్తుతం వరి పంటలో దోమపోటు ఎక్కువగా ఉందని, కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల, పొలంలో నీరు బయటకు వదిలి, నేల ఆరబెట్టడం వల్ల దోమ ఉధృతి తగ్గుతుందని ఏఓ కిరణ్‌కుమార్ చెప్పారు. విజినిగిరి, తాండ్రంగి గ్రామాల్లో నిర్వహించిన'పొలం పిలుస్తోంది' కార్యక్రమాల్లో భాగంగా రైతులకు సస్యరక్షణ చర్యలను వివరించారు.

రాయితీలను వినియోగించుకోండి

వేపాడ: సాగుకోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలు, రాయితీలను రైతులు వినియోగించుకోవాలని ఏఓ సి.బి.యశ్వంతరావు సూచించారు. వేపాడ,వల్లంపూడి గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం వరిపంటను పరిశీలించి, తెగుళ్లను నివారణచర్యలు వివరించారు.